



# గార్డియన్

జాగర్లమూడి సాంబశివరావు

రైలు కదుల్తోందనగా కంపార్ట్‌మెంట్ లోకి దూసుకొచ్చిందా యువతి ఎవరో తన్నిన బంతిలా.

ఉచ్ఛ్వాస నిశ్వాసాల వేగంతో ఎగసి పడుతున్న ఎదపై అదుపు తప్పిన పైట- తెగిన గాలిపటమా? ఎత్తిన తెరచాపా? ఏమో!

గండం గడిచి గట్టెక్కనన్న ధీమా;
గమ్యం తప్పక చేరగలనన్న ఆశా;
తొంగి చూస్తున్నాయామె కళ్ళలో.

పావడా, వోణీలు దాటని వయసులో నర పశువుల నోళ్ళూరించే సొగసులో— అర్ధరాత్రి ఒంటరి పయనం-బరి తెగింపా? కథ ముగింపా?

చేతిలో ఏదో చెత్త నవల తప్ప మరో వస్తువు లేని స్థితిలో మైనరు బేబీలా.

కట్టుబట్టల్లోకూడా కటిక దరిద్రం తాండ విస్తున్న స్థితిలో దిక్కులేనిదానిలా-కంచె లేని మొక్కలా కనబడుతున్న ఆ పడుచుకేదో ఆపద వాటిల్లినట్లు వూహించిన వాసంతి ఖాళీగా వున్న తన ఎదురు సీటుపైకి ఆహ్వానించిందామెని కళ్ళతోనే!

బెత్తం పట్టిన కొత్త టీచరమ్మ ముందుకు హోమ్ వర్క్ చెయ్యని బడిపిల్లలా నడిచి వచ్చిందామె.

"కూర్చో...... ఎందాక ప్రయాణం?"

ఈ ప్రశ్న ఇబ్బందిలో పడేసిందామెని. ఊరు పేరడిగితే ఉలికిపడే అవసరం ఉండేది కాదు. రామాపురంలో 'సీత'నో-కృష్ణాపురంలో 'సత్య'నో చెప్పి వుండేది. కానీ బాగా ఎరిగిన దానిలా ఇరుగు పొరుగు దానిలా —"మద్రాసు కేనా?" అనడిగితే తలూపకేం చేస్తుంది పాపం గంగిరెద్దులా!

"కేరాఫ్ పాండీ బజారా? పానగల్ పార్కా?"

అహం దెబ్బతిన్నట్టు తలెత్తిచూసిందా పిల్ల.

"మరేం లేదు. మనవాళ్ళంతా వుండేది ఆ ప్రాంతాల్లోనేకదా-అని"... నీళ్ళు నములుతూనే నవ్వేసింది వాసంతి.

"మరి...... మీరుండేది..." అని అడగాలని పించిందా పిల్లకి.

అంతలోనే-ఆ మూల పాత్రిళ్ళలో మేలుకొన్న బాబిగాడు మూలిగేడు వొళ్ళు విరుచుకుంటూ. వాణ్ణి మళ్ళీ నిద్రపుచ్చడానికి వాసంతి చేసిన

'తక్కువ నీటితో ఎక్కువ భూమి సాగు'



ప్రయత్నం ఫలించకపోగా-శ్రుతిమించి రాగాన పడ్డాడు.

"ఆకలేసిందేమో పాపం" —జాలిపడిందా పిల్ల.

"ఆహా... నీకూ మాటలు వచ్చన్న మాట! మూగదానివేమో అనుకున్నా"నంటూ-బాబిగాణ్ని వాళ్ళోకి లాక్కుంది వాసంతి.

అందాక పరాయిదానిలా ప్రక్క బెంచీపై పవలింపు సేవలో వున్న పార్వతమ్మ విసుగుతో ముసుగుతీసి "రెప్పలెక్కిన నిద్రకాస్తా ఎగిరిపోయింది రెక్కలొచ్చి వీడి సన్నాయి మేళం విని. కాసిని పాలిచ్చి నిద్రపుచ్చవే అమ్మాయ్" అంటూ ఆర్డరు వేసి మళ్ళీ ముసుగు తన్నేసింది.

"ఎవరామె?" అన్నట్టు చూసిందా పిల్ల.

"మా అమ్మ" — అని చెప్పేసి బాబిగాడికి పాలిచ్చే ప్రయత్నంలో పడిపోయింది వాసంతి. రాత్రి వేళ రైలు శబ్దం జోలపాట కాగా-ఆ పెట్టెలో వున్న కొద్దిమందీ - ఉయ్యాల పాపల్లా నిద్రకొరుగుతున్నారు.

మళ్ళీ యక్ష ప్రశ్నలు వేసే అవకాశం వాసంతికీయరాదన్న సంకల్పంతో పుస్తకం తెరిచిందా పిల్ల. ఆ పుస్తకం పేరు చూస్తేనే తెలుస్తోంది అందులోని సారాంశం.

వెన్నెల వేడిలో కరిగిపోతూ, ఊహాలలో జీవించే సున్నితమైన కన్నె మనసులపై 'మాయ'ను ఆవిష్కరించే పుస్తకం అది.

ఆ మాయలో పడిన ఏ పిల్లైనా - అదుగో అంతే!

పైట జారినా పట్టకుండా, తనను గమనించే కళ్ళను పసిగట్టకుండా-నొక్కి నొక్కి పిండుతోంది దొండపండంటి క్రింద పెదవిని పై పంటితో.

ఆ పిల్ల బుగ్గల్లో పూస్తున్న సిగ్గుల్నీ, పెదవుల్లో కదులుతున్న నవ్వుల్నీ, కళ్ళలో మెరుస్తున్న మెరుపుల్నీ-క్రీగంట చదువుతోంది వాసంతి.

బొజ్జనిండా పాలు తాగిన బుజ్జిగాడు - కేరింతలు కొడ్తూ ఆ పిల్ల వాడిలోకి దూకేడు.

రంగుల కలలోంచి ఉలిక్కిపడిన ఆ పిల్లకి 'సారీ' చెపుతూ బాబిగాణ్ని వెనక్కి లాక్కోబోయింది వాసంతి.

ఇంతలోనే వాడు ఆ పిల్ల వాడిని తడిపేసేడు.

"అయ్యయ్యో..." అని వాసంతీ—

"పర్వాలే"దని ఆ పిల్లా—

మన్నించుకొంటున్న సమయంలో-పుస్తకంలోంచి జారిన 'తోకలేని పిట్ట' ఒకటి వాసంతి వాడిలో తల దాచుకుంది. ఆ పిల్లని టాయిలెట్‌కి పంపి, బుజ్జిగాడి పిర్రమీద సున్నితంగా బుద్ధి చెప్పి, పొత్తిళ్ళలో వాణ్ని బజ్జోపెట్టాక-తన వాడిలో దాక్కున్న 'పిట్ట'ను కనిపెట్టేసింది వాసంతి.

ఆవలిస్తే పేగులు లెక్కెట్టే పద్ధతిలో గబగబా దాని గుట్టు తెలుసుకున్న తర్వాత గూటికి చేర్చింది దాన్ని.

తడిసి పిండిన వోణీని గుండెలపై కప్పుకుంటూ వస్తున్న ఆ పిల్లకి మరోసారి 'సారీ' చెప్పి-బల్ల క్రిందున్న సూట్‌కేసును బైటకు లాగింది వాసంతి. అందులోంచి తీసిన ఖరీదైన వోణీని ఆ పిల్లకిచ్చి "కట్టుకో" అంది.

పంతులమ్మకు విధేయత చూపే బడిపిల్లలా-ఆ వోణీని ధరించిందా పిల్ల.

"నీలాగే... అచ్చంగ నీలాగే పొట్ట బుగ్గల్తో-పోగ కన్నుల్తో ముద్దొస్తూ వుండేది మా చెల్లి. దానిదే ఈ సిల్కు వోణీ"— అంటూ కర్చీఫ్‌తో కళ్ళద్దుకుంది వాసంతి.

"ఐతే... మీ చెల్లి...?"

"బ్రతికే వుంది... నరక కూపంలో."

"అంటే... అత్తవారింట్లోనా?"

"అయ్యో... అంత భాగ్యం కూడానా."

ఇంకేమి అడగాలో తోచక పుస్తకంలో తల దూర్చేసిందా పిల్ల.

"దానికీ నీలాగే పుస్తకాల పిచ్చి" అంటున్న వాసంతికేసి అసహనంగా చూసింది మైనరుబేబి.

"పిచ్చీ... అని ఎందుకంటున్నావంటే-మా చెల్లికూడా ఇలాగే-మనుషుల్తో మాట్లాడుతూనే పుస్తకంలో తల దూర్చేసేది."

"ఇంతకీ మీ చెల్లి ఎక్కడున్నట్టు?" అంటూ పుస్తకం మూసేసిందా పిల్ల.

"దాన్ని తల్చుకుంటేనే దుఃఖం పొర్లుకొస్తోంది"— అంటూ పైటలో మొహం దాచుకుంది వాసంతి.

"అడిగితే తాపం; అడక్కపోతే కోపం" — అనుకుంటూ మళ్ళీ పుస్తకం తెరిచిందా పిల్ల.

"ఊరంతా కోడై కూసింది-మా సీత గీత దాటిందని. కన్నవాళ్ళు కళ్ళెర్రజేసి అడిగితే-ప్రేమించానంది పక్కింటబ్బాయిని. పక్కింటోళ్ళ నడిగితే పక్కున నవ్వేరు. అబ్బాయేమో అడ్రసు లేదు. వున్నట్టుండి ఉత్తరమొచ్చింది సీతకి—" చెప్పకుపోతోంది వాసంతి.

దొంగచాటుగా పుస్తకంలోని ఉత్తరం చదువుకున్న మైనరు బేబి - గీత దాటిన సీత స్థానంలో ప్రవేశించింది.

"సెంట్రల్ స్టేషన్‌లో స్వాగతం పలికేడు పక్కింటబ్బాయ్. రెండు రోజులు సరదాగా



గడిచాయి స్టార్ హోటల్లో. మూడో రోజు ముక్కుపుడక-నాలుగోరోజు నాగరం మార్వాడీ షాపుకు వెళ్ళేయి. ఐదో రోజు "తగిలింది సినిమా ఛాన్స్" అంటూ ఒకణ్ణి తెచ్చి డైరెక్టరుగా పరిచయం చేసి పార్టీ చేసుకుందామన్నాడు. తనచేత బలవంతంగా తాగించారు. తెల్లారేక తెలిసింది-తన దంటూ పోవలసిందింకేమీ లేదని.

స్టార్ హోటల్నించి సాదా హోటల్‌కు మారింది మకాం.

ప్రొడ్యూసరనీ, ఫోటోగ్రాఫరనీ రోజు కొకణ్ణి తెచ్చి, పేరున్న పెద్ద తారలంతా ఇలా పైకొచ్చిన వాళ్ళేనని నచ్చచెప్పేవాడు పక్కింటబ్బాయ్.

ఆ రోజు గూండాలాంటి గుండు మనిషి వచ్చి "పదవే పోదాం బాంబేకి" అన్నాడు. ఎదురు తిరిగితే ఇంజక్షనిచ్చి-"కొన్నానే నిన్నయిదువేలు పోసి" అన్నాడు. తెలివిలోకి వచ్చేసరికి - రెడ్‌లైట్ ఏరియాలో బెడ్‌మీద... తను......

పోలీసుదాడి; కోర్టులో కేసు.

పత్రికల్లో తన బొమ్మ చూచిన అమ్మ, గావు




కేక! నాన్న ఆత్మాహుతి!!

—పెద్ద పెట్టున కేక పెట్టింది మైనరు బేబి. ఉలికిపడి లేచింది బాబిగాడితోపాటు పార్వతమ్మ కూడా.

"అక్కా! నన్ను రక్షించు"-వాసంతిని వాటేసుకుంది బేబి.

"ఏం జరిగిందే అమ్మాయ్" అంటూ దగ్గరకొచ్చిన పార్వతి ఏడుస్తున్న బాబిగాణ్ని సముదాయిస్తూ-తల్లికి సైగలు చేస్తోంది వాసంతి.

"మీ చిన్న కూతుర్లాంటి దాన్ని. మీరే నాకు దిక్కు. మా పక్కింటబ్బాయ్ మాయలోపడి మద్రాసు రైలెక్కేను,"

—అంటూ పుస్తకంలోంచి లెటరు తీసి వాసంతికిచ్చింది.

"చిన్న కూతురెవరు? ఉన్నదే నాకొక్క కూతురు" అంటున్న పార్వతమ్మ చెవిలో గుసగుస లాడింది వాసంతి.

"మా అమ్మని విధవని చేసే ప్రేమ నాకొద్దు. మా నాన్నని చంపేసే ప్రేమ నాకొద్దు. నా శీలంతో ఆడుకునే ప్రేమ నాకొద్దు"- అంటూ కుమిలిపోతున్న బేబీ తలను నిమురుతూ—"గౌరవంగా మీ వాళ్ళ దగ్గరకు చేర్చే పూచీ నాది"— అంది పార్వతమ్మ.

సీత కథ కల్పించిన వాసంతి ఆపద్ధర్మ గార్డియన్‌గా నటించిందని బేబీకి తెలియకపోవడమే మంచిదికదూ! ◆

**కేశవర్ధిని...**
**పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం**



పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనే

అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్దిచుక్కల కేశవర్ధినిని ఒక వెంబాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

అరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




OBM 8473 TG

**కేశవర్ధిని**
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స (మద్రాసు)
మద్రాసు-600 092